ప్రజాశక్తి

సోమవారం 20 నవంబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

రబీ సాగు మందగమనం

40 రోజులు దాటినా ఊపందుకోని సేద్యం - పెరిగిన వర్షాభావంతో రైతుల వెనుకంజ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఈ ఏడాది రబీ సాగు మందగమనంగా ఉంది. సీజన్ ప్రారంభమై 40 రోజులు దాటినా ఇంత వరకు సేద్యం ఊపందుకోలేదు. గుంటూరు జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో రబీ పంటలు సాగు చేస్తారని అధికారులు అంచనా వేయగా గత 40 రోజుల్లో కేవలం 6 వేల ఎకరాల్లోనే వేశారు. పల్నాడు జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో పంటలేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 1200 ఎకరాల్లోనే సాగు చేశారు. వర్షాభావం కొనసాగడం వల్ల ఖరీఫ్‌లో ఏ పంటలు వేయకుండా ఖాళీగా ఉంచిన భూముల్లో కూడా ఏపంటలు వేయలేదు. పల్నాడులో మూడు లక్షల ఎకరాలు, గుంటూరు జిల్లాలో లక్ష ఎకరాల్లో భూములు ఖాళీగా ఉన్నా రబీలో కూడా ఇప్పటి వరకు సాగు ఊపందుకోలేదు.

ఖరీఫ్‌లో ఏ పంటలు వేయకపోయినా రబీలో ఆరుతడి పంటలు వేసినా ఎంతో కొంత మేలు జరుగుతుందని భావించినా గత రెండు నెలలుగా వర్షాలు లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలాశయాల్లో నీటి నిల్వలు పడిపోవడంతో సాగర్ ఆయకట్టు పరిధిలో ఈ ఏడాది రబీలో కేవలం మినుము, పెసర తప్ప మిగతా పంటలకు అనుమతి లేదని అధికారులు తెలిపారు.అలాగే డెల్టాలో వరి తరువాత సాగు

2లో

గుంటూరు జిల్లాలో రబీ సాగు వివరాలు (ఎకరాల్లో)

పంట	సాగు చేయాల్సింది	సాగైంది
వరి	2800	0
శనగ	21,000	2100
మినుము	13,500	2800
పొగాకు	2000	40
పెసర	27000	0
జొన్న	52000	40
మొక్కజొన్న	51000	20
ఇతర	15,000	2000
పల్నాడు జిల్లాలో		
వరి	72000	40
శనగ	26,000	1100
మినుము	5000	45
పొగాకూ	6000	1300
పెసర	1280	0
జొన్న :	7500	3200
మొక్కజొన్న	20,000	40
కంది :	5000	0
ఇతర :	10,000	2200

పొన్నూరు పట్టణంలో ఉపాధ్యాయుల ప్రదర్శన.. డోలు వాయిస్తున్న జిల్లా అధ్యక్షులు ఆదిలక్ష్మి

ఉపాధ్యాయులను విస్మరించి మనలేరు

- యుటిఎఫ్ గుంటూరు జిల్లా 49వ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు జోజయ్య
- మరింత ఐక్యంగా పోరాటాలకు పిలుపు
- పొన్నూరు పట్టణంలో ఉపాధ్యాయుల భారీ ర్యాలీ

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

ఉపాధ్యాయులను విస్మరించిన ప్రభుత్వం మనుగడ సాగించలేదనే విషయం వైసిపి ప్రభుత్వం గుర్తించాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమవుతోందని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర మాజీ అధ్యక్షులు కె.జోజయ్య అన్నారు. యుటిఎఫ్ గుంటూరు జిల్లా 49వ కౌన్సిల్ సమావేశం పొన్నూరు పట్టణంలోని జెఎంఆర్ ఫంక్షన్ హాల్ (గరికపాటి శ్రీనివాస్ ప్రాంగణం)లో ఆదివారం నిర్వహించారు. జెఎంఆర్ ఫంక్షన్ హాలు నుండి ఐలాండ్ సెంటర్ వరకూ ఉపాధ్యాయులు, నాయకులు భారీ ర్యాలీ చేశారు. సెంటర్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తిరిగి సమావేశాల ప్రాంగణం వద్దకు ర్యాలీగా వెళ్లారు. ఎస్‌టిఎఫ్ఐ జెండాను

2లో

యువకౌలురైతు ఆత్మహత్య

మొయిన్‌లో

ప్రభుత్వ విద్య బలోపేతం.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం

ఈ రెండు లక్ష్యాలతో యుటిఎఫ్ పోరాటాలు - 26న గురజాలలో జిల్లా రెండో కౌన్సిల్ సమావేశం

8 లో

పెద్ద స్క్రీన్లపై ఫైనల్ మ్యాచ్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

క్రికెట్ వరల్డ్ కప్ టోర్నీలో భాగంగా ఇండియా-ఆస్ట్రేలియాలు తలపడిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకూ టీవీలు, సెల్‌ఫోన్లలో మ్యాచ్‌లను చూసిన క్రీడాభిమానులు ఫైనల్ మ్యాచ్‌ను చూసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. పలుచోట్ల పెద్ద డిజిటల్ స్క్రీన్‌లను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో భాగంగా సత్తెనపల్లిలోని వైసిపి కార్యాలయంలో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేయగా మంత్రి అంబటి రాంబాబు పైతం మ్యాచ్‌ను ఇతర క్రీడాభిమానులతో కలిసి వీక్షించారు. మరోవైపు అధిక శాతం మంది వీక్షకులు టీవీలకు అతుక్కుపోయారు. మధ్యాహ్నం ఒంటిగంటకే పనులన్నీ ముగించుకుని ఇళ్లకు చేరుకున్నారు. అయితే ఇండియా ఓడిపోవడంతో అందరూ తీవ్ర నిరాశకు గురయ్యారు.

వాలంటీర్లతోనే కులగణన

- 27 నుంచి ఇంటింటి సర్వేలో కుటుంబ సభ్యుల వివరాల నమోదు
- తప్పుల దిద్దుబాటుకు 10వ తేదీ వరకు గడువు
- ప్రజాశక్తితో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేషశ్రీ

8 లో

27, 28 తేదీల్లో విజయవాడలో మహాధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

పంటలన్నిటికీ పెట్టుబడి వ్యయంపై 50 శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించి, చట్టబద్ధత కల్పించాలని, రైతులు, పేదల పాలిట ఉరితాడుగా మారే విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని తదితర డిమాండ్లతో ఈనెల 27, 28 తేదీల్లో విజయాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు కరపత్రాన్ని బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, ఎఐటియుసి నాయకులు పి.సత్యనారాయణ, రైతు కూలీ సంఘం నాయకులు యు.నాగేశ్వరరావు, ఏపీ రైతు సంఘం నాయకులు పశ్చల శివాజీ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, కిసాన్ ఫెడరేషన్ నాయకులు కాలువ శ్రీధర్‌రావు, సిఐటియు నాయకులు కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భారత దేశాన్ని కార్పొరేట్లకు అప్పగిస్తూ, వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. కార్మిక చట్టాలను నీరుగారుస్తోందని, రైల్వేలు, విమానయానం, బొగ్గు గనులు, బీమా, బ్యాంకులు సహా విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయాలని యత్నిస్తోందని మండిపడ్డారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కౌలు రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలివ్వాలని, రైతుల పంట రుణాలు ఒక పర్యాయం రద్దు చేయాలని, కేరళలో మాదిరిగా రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించాలని, కార్పొరేట్ అనుకూల పంటల బీమా పథకాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లు రద్దు చేసి, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగుల్ని క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ డిమాండ్లతో నిర్వహించే ధర్నాలో రైతులు, కౌలు రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బి.రామకృష్ణ, పి.డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

జెండాల ఆవిష్కరణలో ప్రతినిధులు, నాయకులు

ఉపాధ్యాయులను విస్మరించి మనలేరు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర సహాధ్యక్షులు ఎఎస్ కుసుమకుమారి, యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు జి.మోహన్‌రావు ఆవిష్కరించారు. అనంతరం కొసరాజు హరికృష్ణబాబు వేదికపై నిర్వహించిన సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జోజయ్య మాట్లాడుతూ 50 ఏళ్ల యుటిఎఫ్ ప్రయాణంలో అనేక పోరాటాలు చేసిందని, ఉపాధ్యాయులకు అనేక హక్కులు సాధించి పెట్టిందని గుర్తు చేశారు. ఉద్యమాలను అణచాలని ప్రభుత్వాలు యత్నించినా అది తాత్కాలికమేనని, అణచివేత పరాకాష్టకు చేరిన రోజున పాలకులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఉపాధ్యాయులు మరింత పట్టుదలతో ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను కించపరిచేలా మాట్లాడుతున్నారని, ఆయనతీరు అసలు బాగోలేదని అన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేస్తామని పాదయాత్ర సందర్భంగా హామీనిచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులంతా ఐక్యంగా పోరాడ్డం ద్వారానే హక్కులు సాధించుకోవాలని అన్నారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, గౌరవాధ్యక్షులు పీవీ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి డి.సాయికృష్ణ, కె.బావన్నారాయణ, జిల్లాలోని అన్ని మండలాల నుండి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రబీ సాగు మందగమనం

(మొదటి పేజీ తరువాయి)

చేసే జొన్న,మొక్క.జొన్నకు ఈఏడాది అనుమతి లేదని అధికారులు ప్రకటించారు. అంతేగాక వరి కోతలు పూర్తయిన వెంటనే రబీ పంటలు వేయడం ఆనావాయితీగా ఉన్నా ఈ ఏడాది డెల్టాలో కూడా చాలా ప్రాంతాల్లో భూములు బెట్టకు రావడం వల్ల మినుము, పెసర, శనగ తదితరపంటలు సాగుకు కూడా రైతులు తర్జన భర్జనలు పడుతున్నారు. పులిచింతలలో కూడా నీటి నిల్వలు 14 టిఎంసిలకు తగ్గిపోవడం వల్ల ఈనీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాల్సి ఉన్నందున రబీ పంటలకు నీరు ఇవ్వలేమని అధికారులు తెలిపారు. దీంతో డెల్టాలో వరి తరువాత జొన్న, మొక్కజొన్నపై రైతులు ఆశలు వదులుకున్నారు.

పల్నాడు ప్రాంతంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఖరీఫ్ ప్రారంభం నుంచి పల్నాడును కరవు వెంటాడుతోంది. గత ఆరునెలల కాలం కాలంలో కనీస వర్షపాతం నమోదు కాని పరిస్థితి నెలకొంది. అక్టోబరు, నవంబరులో కనీస వర్షపాతం నమోదు కాలేదు.అంతేకాకుండా ప్రతి ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో తుపాను రావడం అనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది గత రెండు నెలల కాలంలో తుపాను ప్రభావం ఉమ్మడి గుంటూరు జిల్లాపై ఏమాత్రం కనిపించలేదు. కనీస వర్షపాతం నమోదు కాకపోవడం వల్ల రబీ సాగుకు తీవ్ర ఆటంకంగా మారింది.

రోడ్డు వేసేదాక ఆందోళనలు

రెండోరోజు కొనసాగిన టిడిపి, జనసేన నిరసనలు

నందివెలుగు-కొలకలూరు రోడ్డుపై ధర్నాలో టిడిపి జనసేన శ్రేణులు

కారంపూడి మండలం ఒప్పిచర్ల, నరమాలపాడు రహదారిపై నిరసన

ప్రజాశక్తి - తెనాలి

వైసిపి పాలనలో రోడ్లు అధ్వానంగా మారాయని, ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి కార్యాచరణలో భాగంగా అధ్వాన్నంగా ఉన్న రోడ్ల పరిస్థితిపై చేపట్టిన ఆందోళనలు కొనసాగించారు. ఆదివారం తెనాలి వద్ద నందివెలుగు-గుంటూరు మార్గంలో కొలకలూరు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.280 కోట్లు మంజూరు చేస్తామని సాక్షాత్తు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచలేదన్నారు. రోడ్లు అధ్వాన్నంగా, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కరంగా ఉన్నాయని, రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయని చెప్పారు. రోడ్ల నిర్మాణం చేపట్టాలని, అవసరమైన చోట కనీసం మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకూ తమ ఆందోళన కొనసాగుతుందన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ తెనాలి బండ్ పేరుతో విగ్రహాలకు ఖర్చు పెట్టే నిధులు రోడ్లకు కేటాయిస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. దాదాపు గంటకు పైగా జరిగిన నిరసనలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నాయకులు టి.హరి ప్రసాద్, ఆర్.చిన్ని, ఇ.వెంకటపూర్ణచంద్, బి.అరుణ, డి.అనిత, జనసేన నాయకులు హరిదాసు గౌరీశంకర్, జాకీర్ హుస్సేన్, డి.మధుబాబు పాల్గొన్నారు. మండల కేంద్రమైన పెదకాకానిలోనూ నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా కారంపూడి మండలంలోని ఒప్పిచర్ల - నరమాలపాడు రహదారిపై నిరసన తెలిపారు. నాయకులు బి.రామాంజనేయులు, పి.అంజయ్య, పి.హరి, యు.లక్ష్మీనారాయణ, జి.సురేష్ యాదవ్, సిహెచ్.రాము, కె.కృష్ణబాబు, కె.నాయుడు పాల్గొన్నారు.

ప్రాంతీయ గ్రంథాలయంలో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక ఏసీ కాలేజి ఎదురుగా ఉన్న ప్రాంతీయ గ్రంథాలయంలో జాతీయ మహిళా దినోత్సవం, ఇందిరాగాంధీ జన్మదినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్. జ్యోత్స్నకుమారి, ఎవికె సుజాత హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జోత్స్నకుమారి మాట్లాడుతూ ఇందిరాగాంధీ జీవిత విశేషాలు, దిశ చట్టం, మహిళా సాధికారిత, స్త్రీల స్థితిగతులు గురించి వివరించారు. స్త్రీలను, పిల్లలను రక్షించుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దిశ చట్టం- మహిళా సాధికారిత గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రథమ శ్రేణి సహాయ గ్రంథపాలకులు కె.సుధాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నరేంద్రపై అక్రమ కేసులు తగవు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర పై ఇష్టారాజ్యంగా తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచెయ్యాలని చూస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంగం డైరీ డైరెక్టర్ శ్రీనివాస్ ను అరెస్టు చేయటం,ధూళిపాళ్ల నరేంద్ర పై హత్యాయత్నం కేసు పెట్టడాన్ని కోవెలమూడి రవీంద్ర ఖండించారు.తెలుగుదేశం పార్టీ నేతల పై కేసులు పెట్టినంత మాత్రాన తమ నాయకుల మనోధైర్యాన్ని మీరు దెబ్బ తియ్యలేరన్నారు.

జిజిహెచ్‌లో వైద్యులు, సిబ్బంది శ్రమదానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి కి అత్యవసర విభాగానికి (క్యాజువాల్టి) రోగుల తాకిడి పెరగడంతో ప్రత్యామ్నాయంగా పక్కనే క్యాంటిన్‌కు వినియోగిస్తున్న స్థలంలో పడకలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆసుపత్రి లోని ప్రైవేట్ కమర్శియల్ క్యాంటిన్‌లో 30 పడకలను ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన నాలుగు గదులను గుర్తించినట్లు తెలిపారు. వైద్య సిబ్బంది తో కలసి ఆయన శ్రమదానం చేశారు. జగనన్న స్వచ్ఛ సంకల్ప భాగంగా డాక్టర్ కిరణ్ కుమార్ చీపురు పట్టి బూజు దులిపి పాత సామానులను, పనికి రాని వస్తువులను తొలగించి పరిశుభ్రత చేశారు. ఈ గదుల్లో విద్యుత్ సౌకర్యాన్ని అందించి ఫ్యాన్లు, ట్యూబ్ లైట్ల ను అమరుస్తామన్నారు. రోగులకు బాత్ రూమ్ లను కూడా సిద్ధం చేస్తున్నామని ఆయన చెప్పారు. పెరుగుతున్న రోగుల ను దష్టి లో పెట్టుకుని ఎక్కడెక్కడ పడకలు అవసరమో వాటిని గుర్తించి అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, సమీనా బేగం, ఇంజనీరింగ్ శాఖ అధికారులు రత్తయ్య, సత్యం, బయో మెడికల్ ఇంజనీర్ చంద్రశేఖర్, పాల్గొన్నారు.

భారీ తెర ఎదుట తీవ్ర నిరాశ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వన్‌డే వరల్డ్ కప్ ఫైనల్లో ఇండియా ఓటమితో జిల్లాలోని క్రీడాభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈమ్యాచ్‌ను వీక్షించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ స్థానిక అరండల్‌పేటలోని శివాజీ మైదానంలో భారీ తెరను ఏర్పాటు చేశారు. అలాగే పలు విద్యా సంస్థల్లో కూడా భారీ తెరలను ఏర్పాటు చేసి విద్యార్థులు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. శివాజీ మైదానంకు ఆదివారం మధ్యాహ్నానికు యువకులు భారీగా తరలివచ్చారు. మ్యాచ్ ప్రారంభంలో కొంత ఉత్సాహంగా కన్పించిన క్రీడాభిమానులు టీంఇండియా ఆసీస్ ముందు 241 పరుగుల స్వల్ప లక్ష్యాన్నే ఉంచడంతో తీవ్ర నిరాశ చెందారు.అయినా ఆసీస్‌పై గెలుపు సాధిస్తామని రాత్రి 7 గంటల వరకు వేచిచూసినా చివరికి 3 వికెట్ల తేడాతో ఆసీస్ ఘన విజయం సాధించడంతో అభిమానులంతా నిరాశతో వెనుదిరిగారు. టీమిండియా ప్రపంచ కప్ కైవసం చేసుకుంటే భారీ ప్రదర్శనలకు, బాణ సంచా కాల్చేందుకు ఏర్పాట్లు చేసుకున్న వారంతా నిరుత్సాహానికి లోనయ్యారు. అంతకు ముందే భారీ తెరను మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాలి గిరి, కార్పొరేటర్ ఈచంపాటి ఆచారి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు యువతను ఉత్సాహ పరిచారు. గెలుపు మనదేనని ధీమా వ్యక్తం చేశారు. కానీ చివరికి భారత్ ఓటమితో ప్రజా ప్రతినిధులు కూడా నిరాశకు గురయ్యారు.

పొన్నూరు మండల కట్టెంపూడి శివాలయం ప్రాంగణంలో ఆదివారం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనక నిర్వహించారు. పట్టణ మరియు మండలంలోని అన్ని కెమిస్ట్‌ల కుటుంబ సభ్యులు పాల్గొని సంతోషంగా గడిపారు.

వైట్‌నర్ మత్తులో యువత

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడ్డ యువత నిర్వీర్యం అవుతుంది. విలువైన తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల ధరలు అధికంగా ఉండటంతో వైట్‌నర్ లాంటి మత్తు పదార్థాన్ని పలచటి గుడ్డలో వేసి పీల్చుతున్నారు. క్షణాల్లో మెదడు అంతా మొద్దుబారి శరీరం మొత్తం ఆధీనం తప్పుతుందని డాక్టర్లు చెబుతున్నారు. ఈ మత్తు బారిన యువత పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. నిత్యం విజయవాడ- చెన్నై మధ్య కృష్ణా కెనాల్ జంక్షన్ రైల్ ట్రాక్ పక్కన నిత్యం ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ధూమపానం, మద్యపానం, మాదర ద్రవ్యాల వాడకం వల్ల ప్రమాదమని చెబుతున్నా వినే వారే కరువయ్యారని పెద్దలు వాపోతున్నారు. ప్రభుత్వం పెద్దఎత్తున ఖర్చు పెట్టి ప్రకటనలిచ్చినా ఫలితం కనిపించడంలేదు. ముఖ్యంగా దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న పిల్లలు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం, వారి పరిసర ప్రాంతాల ప్రజల అలవాట్లు మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని పలువురు చెబుతున్నారు. ఎవరో వచ్చి చెప్పే వరకు తల్లిదండ్రులు వ్యసనాల బారిన పడిన తమ బిడ్డలను గుర్తించలేక పోతున్నారని పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇటువంటి పక్కదారి

పట్టిన యువతకు కౌన్సెలింగ్ ఇప్పించి బాలల బతుకులు బానిస బతుకులు కాకుండా చూసే బాధ్యత తల్లిదండ్రులు, అధికారులు చూడాల్సిన అవసరం ఉంది.

ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీనారాయణ రెడ్డి

ప్రజాశక్తి- నూజెండ్ల

నూజండ్ల మండలం (ఐన ఓలు) యస్ఐగా లక్ష్మీ నారాయణ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న అనిల్ కుమార్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో లక్ష్మీనారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో వినుకొండ, ఫిరంగిపురం, జి. ముప్పాళ్ళ, మాచవరం స్టేషన్ లలో ఆయన విధులు నిర్వహిం చారు. బాధ్యతలు చేపట్టిన యస్ఐ ను సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. మండలంలో ఇసుక అక్రమరవాణా, బెల్టు షాపులను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని గుండిమెడలో అక్రమ ఇసుక రవాణా చేసే రెండు ట్రాక్టర్లను, ఆదివారం తాడేపల్లి పోలీసులు పట్టుకొని, సీజ్ చేశారు. వే బిల్లులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తుండడంతో తాడేపల్లి పోలీసులు ట్రాక్టర్లను సీజ్ చేసి తాడేపల్లి స్టేషన్ కు తరలించారు. ఇటీవల కాలంలో గుండిమెడ నుండి భారీ స్థాయిలో ఇసుక రవాణా అవుతుండడం తో పోలీసులు నిఘా ఉంచారు.

ట్రేడ్‌మార్క్ లైసెన్సుతో మోసాలకు చెక్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ట్రేడ్ మార్కులు, బ్రాండెడ్ పేరుతో కొంత మంది అసలుకు దీటుగా నకిలీ వస్తువులను మార్కెట్‌లోకి తీసుకువచ్చి మోసాలకు పాల్పడుతున్నారని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఆతుకూరి ఆంజనేయులు అన్నారు. స్థానిక జిన్నాటవర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో వ్యాపార వర్గాలకు ఆదివారం అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. వ్యాపారులు అంతా ట్రేడ్ మార్కు లైసెన్సులు తీసుకుంటే మోసాలు కొంత వరకు అరికట్ట వచ్చునని తెలిపారు. వోక్సో ఫాంటమ్ ఐటీ సొల్యూషన్స్ నిర్వహకులు మామిళ్లపల్లి సుధీర్ నకిలీ ఉత్పత్తులు మార్కెట్‌లోకి రాకుండా చర్యలు తీసుకుంటామని ఇందుకోసం ట్రేడ్ మార్కు లైసెన్సులు ఇస్తామన్నారు.

మాట్లాడుతున చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఆంజనేయులు

కొండపల్లి సిటీ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక బృందావన్ గార్డెన్స్ కుందులరోడ్డులో రైతు బజారు వద్ద ఏర్పాటు చేసిన కొండపల్లి సిటీక్లినిక్‌ను ప్రముఖ ఊపిరితిత్తుల వైద్యులు కొండపల్లి నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. బృందావన్‌గార్డెన్స్ ప్రాంతంలో ఊపిరితిత్తులకు సంబంధించి ఆస్పత్రిని తొలిసారిగా ప్రారంభించినట్టు డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు.నగరంలోని పలువురు వైద్యులు, వ్యాపారులు పెద్దసంఖ్యలో హాజరు అయ్యారు.

మధుమేహంతో కిడ్నీలకు ముప్పు

నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కె.రఘురాం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మధుమేహ బాధితులలో రక్తంలోని దీర్ఘకాల అధిక శాతం షుగర్ ప్రభావం కిడ్నీలపై పడుతుందని, కిడ్నీల వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ కె .రఘురాం అన్నారు. ప్రపంచ మధుమేహ నిరోధక మాసం సందర్భంగా ఎస్ .హెచ్ .ఓ.హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా, స్థానిక బ్రాడీపేటలోని ఎస్ .హెచ్. ఓ .భవనంలో ఆదివారం నిర్వహించిన కిడ్నీ వ్యాధులపై శాస్త్రీయ అవగాహన సభ - ఉచిత వైద్య సలహా శిబిరంలో డాక్టర్ రఘురాం పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్(ఎస్ హెచ్ ఓ) అధ్యక్షులు డాక్టర్ టి సేవ కుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ రఘురాం ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఒక్కో కిడ్నీలో 10 లక్షల నెఫ్రాన్ లు ఉంటాయని ,వీటి పై రక్తంలోని అధిక సుగర్ ప్రభావం చూపుతుందని, అందువల్లే ఈ నెఫ్రాన్ ల కనత్వచాలలో అసాధారణ మార్పులుచోటు చేసుకుంటాయన్నారు. ఫలితంగా కిడ్నీల పనితీరులో మార్పులు వస్తాయన్నారు. సాధారణంగా కిడ్నీలలో ప్రోటీన్లు ఫిల్టర్ కావని ,అయితే డయాబెటిస్ గల వారిలో ప్రోటీన్లు లీకై మూత్రంలో విసర్జించబడతాయన్నారు. దీనినే వైద్యశాస్త్ర పరిభాషలో ప్రోటినూరియా అని డయాబెటిక్ నెఫ్రోపతి అని పేర్కొంటారు అన్నారు. నిర్లక్ష్యం చేస్తే చివరకు కిడ్నీల ఫెయిల్యూర్ కు దారితీస్తుందన్నారు. రెండు కిడ్నీలు పూర్తిగా చెడిపోయే వరకు సాధారణ రక్త పరీక్షలలో గుర్తించలేమని , అయితే మూత్ర పరీక్షల ద్వారా కిడ్నీల పనితీరును తొలి దశలోనే గుర్తించే అవకాశం ఉందన్నారు. కిడ్నీలు పూర్తిగా దెబ్బతిన్న వారిలో శరీరంలో నీరు చేరడం ముఖ్యంగా రెండు కాళ్లకు నీరు చేరడం , మొఖం ఉబ్బడం, రక్తం తగ్గిపోయి రక్తహీనతకు గురికావడం ,ఆకలి లేకపోవడం, నీరసం, నిస్సత్తువ, చర్మం పొడిబారి ఉండడం ,మూత్రం రాకపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. కిడ్నీలు పూర్తిగా చెడిపోయిన వారికి కిడ్నీ మార్పిడి తప్ప మరో చికిత్స లేదన్నారు.తొలి దశలోనే డయాబెటిక్ నెఫ్రోపతిని గుర్తించేందుకు "మైక్రో ఆల్బ బినూరియా "అనే పరీక్ష ఎంతగానో దోహదపడుతుందన్నారు. మధుమేహ బాధితులు తరచూ ఈ పరీక్ష చేయించుకోవడం ద్వారా కిడ్నీల పనితీరును సమీక్షించుకోవచ్చు అన్నారు. రక్తంలో షుగర్ శాతాన్ని పూర్తిగా నియంత్రణలో ఉంచుకుంటూ ,తరచు ఈ పరీక్ష చేయించుకోవడం ద్వారా తొలి దశలోనే "డయాబెటిక్ నెఫ్రోపతి"ని గుర్తించవచ్చును అన్నారు .ఈ పరీక్ష అందరికీ నేడు అందుబాటులో ఉందన్నారు .వీటికి తోడు బ్లడ్ యూరియా, సీరం క్రియాటినిన్ పరీక్షలు కూడా అవసరమవుతాయన్నారు. మధుమేహబాధితులు కిడ్నీలను నిర్లక్ష్యం చేయకుండా ముందు జాగ్రత్తలతో కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు . సభలో పాల్గొన్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో మధుమేహం బాధితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది అని వారిలో చాలా మంది సక్రమంగా మందులు వాడటం లేదన్నారు.అందువల్లనే నెఫ్రోపతి వంటి కాంప్లికేషన్లు వస్తున్నాయన్నారు . ఈ దీర్ఘకాల వ్యాధులపై ప్రజల్లో చైతన్యంమేలక్ష్యంగా తమ సంస్థలు ఈ సభలు ,ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. సభలో పాల్గొన్న ఎస్ హెచ్ ఓ అధ్యక్షులు డాక్టర్ టి సేవ కుమార్ మాట్లాడుతూ నేడు ప్రజలకు వైద్య పరీక్షలు చాలా ఖరీదైపోయాయని సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులలోనే తమ వంతు కర్తవ్యంగా ఎస్ .హెచ్ .ఓ. స్పెషాలిటీ ల్యాబ్స్ ద్వారా అతి తక్కువ ఖర్చుకి పరీక్షలు అందించడం జరుగుతుందన్నారు .మొత్తం 86 పరీక్షల కంప్లీట్ హెల్ప్ చెకప్ ను కేవలం 1250 రూపాయలకే అందిస్తున్నామన్నారు. సంవత్సరానికి ఒకసారి ఈ హెల్త్ చెకప్ చేయించుకోవడం ద్వారా తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవచ్చు నన్నారు. గుర్తించిన వ్యాధులకు తొలి దశ లోనేచికిత్స పొందే అవకాశం ఉంటుందన్నారు.

సభానంతరం డాక్టర్ రఘురాం కిడ్నీ వ్యాధుల బాధితులకు పరీక్షించి ఉచిత వైద్య సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ .హెచ్ .ఓ మేనేజర్ పి. నిర్మల రాణి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ ,పావులూరి రమేష్, కార్యదర్శి సిహెచ్ సుబ్రహ్మణ్యం సభ్యులు శివాజీ , సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

వైద్య సలహా శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ రఘురాం



చిలకలూరిపేట

ఇందిరా గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇంది రా గాంధీ జయంతి ఆదివారం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మద్దుమాల ప్రసన్నాంజనేయులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎం.రాధాకృష్ణ మాట్లాడుతూ పేద ప్రజలకు పట్టెడన్నం పెట్టాలి,రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో హరిత విప్లవ సాధనకు ఇందిరా గాంధీ కృషి చేశారని అన్నారు. బ్యాంకుల ను జాతీయం చేయడం ద్వారా రైతు రైతు కూలీల పరపతి సౌకర్యాన్ని పెంపొందించిన ఘనత ఆమెదే నన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎం. ప్రసన్న, నాదెండ్ల మండల కాంగ్రెస్ అధ్య క్షుడు షేక్ బాజీ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ కరిమూన్, మహిళా కాంగ్రెస్ సీనియర్ నాయకు రాలు ఎలికా శివపార్వతి తదితరులు పాల్గొన్నారు. **పెదకాకాని రూరల్:** పెదకాకాని లూధరగిరి కాలనీలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంతేటి ఎల్మందరావు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. **మంగళగిరి:** మంగళగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి కమిటీ కన్వీనర్ షేక్ సలీం, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సలీం మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కాపు సాధికారక చైర్మన్ రేమినిశెట్టి హనుమంతరావు, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కూర్మాల రాధిక, నాయకులు గోలి సాంబశివరావు, చిలకా కార్తీక్, దామర్ల వీరప్రసాద్, కురగంటి చినరత్తయ్య, బొడ్డు రామారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి కూడా నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. **తాడేపల్లి:** ఉండవల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహిచిన ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమంలో పార్టీ ఒబిసి జిల్లా చైర్మన్ పున్నారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో బి.శివసాంబిరెడ్డి, ఎ.హేమచందరరావు, సుధాకర్, రాజు, రాధిక, సిహెచ్.రాఘవరావు, శివ, పి.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని



మంగళగిరి

ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన

మరుగుదొడ్ల ఆవశ్యతపై ర్యాలీ

ప్రజాశక్తి - వినుకొండ

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా స్థానిక తిమ్మాయపాలెం రోడ్డులోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తిమ్మాయపాలెం డిజిటల్ అసిస్టెంట్ కొల్లి శివ, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని ఉపయోగించాలని, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే వారి మరుగుదొడ్డిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయరాదని, ప్రతి ఒక్కరూ భోజనానికి ముందు, మల విసర్జన తర్వాత వారి చేతులను తప్పని సరిగా సబ్బుతో మూడు నిమిషాల పాటు శుభ్రపరుచుకోవాలని సూచించారు. ఆయా విషయాలపై అవగాహన కల్పించి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ డైరెక్టర్ కొల్లి లక్ష్మి కుమారి పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఐలా శ్రీనివాసరావు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

175 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట శకుంతల హాస్పిటల్ ఆధ్వర్యంలో రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని హాస్పిటల్ అధినేత డాక్టర్ ఐలా శ్రీనివాసరావు తెలిపారు. డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు 175 మంది వరకు వైద్య సేవలు పొందారన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించాలనే ఉద్దేశ్యంతో తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరంలో లివర్ సమస్యలు, గాల్ బ్లాడర్, పాంక్రియాస్ సమస్యలు, పొట్ట ఉబ్బసం, కడుపునొప్పి, మంట, పచ్చ కామెర్లు, ఛాతీ నొప్పి, ఆకలి లేకపోవడం, బిపి, షుగర్, జలుబు, దగ్గు, జ్వరం, థైరాయిడ్ వంటి సాధారణ వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. రానున్న రోజులలో తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. తమ హాస్పిటల్ లో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరలలో కార్పోరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యమన్నారు.

అందని గౌరవవేతనం

- ఆరు నెలలుగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు
- మూడు నెలలుగా వార్డు కౌన్సిలర్లకు పెండింగ్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గ్రామ సర్పంచ్‌లకు(ప్రెసి డెంట్లకు), మండల ప్రాదేశిక పరిషత్తు (ఎంపిటిసి) సభ్యులకు, మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లకు ప్రతి నెలా ఇవ్వాల్సిన గౌరవ వేతనం నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. ఆయా పదవుల్లో ఉన్న అధికార వైసిపికి చెందిన వారే విమర్శలు గుప్పిస్తున్నారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు ఆరు నెల లుగా ,వార్డు కౌన్సిలర్లకు మూడు నెలలుగా గౌరవవేతనం అందని పరిస్థితి. చిలకలూరిపేట మండల పరిధిలో 29 గ్రామాలు 29, మున్సిపాలిటిలో వార్డు కౌన్సిలర్లు 41 మంది (కో-ఆప్షన్ సభ్యులు ముగ్గురితో కలుపుకుని),ఎంపిటిసిలు 13 మంది వున్నారు. గౌరవవేతనంగా సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు రూ.3 వేలు, వార్డు కౌన్సిలర్లకు రూ.2500 ఉంది. నెలల తరబడి దీనిని పెండింగ్ పెడుతున్నారు. సర్పంచులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లలోను ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన వారు, పేదలు కూడా ఉన్నారు. వారికి ప్రతినెలా రావాల్సిన గౌరవవేతనం కోసం ఎదురుచూస్తుంటారు. గౌరవవేతనం పెండింగ్‌లో ఉండటంపై పేరు చెప్పడానికి నిరాకరించిన అధికార పార్టీకి చెందిన ఓ సర్పంచ్ మాట్లాడుతూ మొదట్లో రెండు,మూడు నెలల పాటు సక్రమంగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేసేవారని చెప్పారు. సంవత్సరాల తరబడి గౌరవవేతనం ఇవ్వకుండా వారికి గుర్తుకువచ్చినప్పుడు ఇస్తున్నారని విమర్శించారు.వాలంటీర్లకు గౌరవవేతనం కింద రూ.5 వేలు ఇస్తున్నారని, పర్యవేక్షణ చేసే తమకు మాత్రం రూ.2,500 మాత్రమేనని, అది కూడా ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి అని ఓ కౌన్సిలర్ విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి క్రమం తప్పకుండా గౌరవ వేతనం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. గౌరవ వేతనాన్ని రూ.5 వేలకు పెంచాలని కూడా వారు కోరారు.

మాట్లాడుతున్న హనుమంతరెడ్డి

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి

ప్రజాశక్తి - వినుకొండ

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంత్ రెడ్డి అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మండల రైతు సంఘం కార్యదర్శి రాజారపు ముని వెంకటేశ్వర్లు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 27, 28 తేదీలలో కార్మిక, రైతు సంఘాలు నిర్వహిస్తున్న మహా ధర్నాను విజయవంతం చేయా లని పిలుపునిచ్చారు. పండిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కౌలు రైతులకు రుణాలన్నించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ సిఐటియు గౌరవాధ్యక్షులు బొంకూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి కార్మికుల హక్కులను పునరుద్ధరించాలని, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.తిరుమల లక్ష్మి, అంగలకుదురు ఆంజనేయులు, రంజాన్ బి, రైతు సంఘం నాయకులు కోటిరెడ్డి, సత్యనారాయణ, బండి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడైపోయిన చేతిపంపునకు మరమ్మతులేవి!

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండలంలోని నాగిరెడ్డిపాలెంలో తాగునీటి సమస్య ను పరిష్కరించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తు న్నారని నాగిరెడ్డిపాలెం ఎస్టి కాలనీ గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాటర్ స్కీం కింద నాగిరెడ్డిపాలెంలోని చేతి పంపు రెండు నెలలుగా పనిచేయడం లేదని, దాని మర మ్మతులు చేయాలని పంచాయతి కార్యాలయం చుట్టూ తిరిగినా తమ గోడు ఎవరు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయతి అధికారులు స్పందించి తాగునీటి సమ స్యను పరిష్కరించాలని 80 కుటుంబాల వారు విజ్ఞప్తి చేశారు.

నాగిరెడ్డిపాలెం ఎస్టి కాలనీలో పాడైపోయిన పంపు

నాగిరెడ్డిపాలెం ఎస్టి కాలనీ వాసులు

నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు వితరణ

ప్రజాశక్తి - వినుకొండ

ఆర్థికంగా వెనుకబడ్డ బ్రాహ్మణ కుటుంబాలకు వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యలో ఆదివారం నిత్యావసర వస్తువులను అందజేశారు. జీవి మాధవరావు కార్యాలయంలో ఎనిమిది మందికి బియ్యం, నూతన వస్త్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో విశిష్టఅతిథులుగా రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు నాగ రాజు రామ రాజు, ప్రధాన కార్య దర్శి జి .వాసుదేవ రావు, కార్య నిర్వహణ అధ్యక్షులు ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, పసుపుల మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు ఎక్కువసార్లు సహాయ సహకారాలు అందించిన అప్పరాజు నాగేశ్వర రావు, దారా రామ మూర్తి, మాదిరాజు నాగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు.

రైతులను రాబందుల్లా పీక్కు తింటున్న ప్రభుత్వాలు

మహా ధర్నా జయప్రదం చేయండి: సిఐటియు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతు పక్షపాతి ప్రభుత్వాలు అని చెప్పుకుంటున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను రాబందుల్లా పీక్కు తింటున్నాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్ విమర్శించారు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ రంగ అభివృద్ధి రైతుల సంక్షేమం ద్వారానే రాష్ట్ర దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని గ్రహించలేని మొద్దు ప్రభుత్వాలను నిద్రలేపేందుకు విజయవాడలో ఈ నెల 27, 28 తేదీలలో జరిగే 36 గంటల పాటు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. అఖిల భారత కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిగే ఈ ధర్నాలో 500 సంఘాలకు పైగా పాల్గొంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు లేక సాగునీరు లేక ఎండిపోతున్న పంటలను చూసి అన్నదాతలు కన్నీరు కారుస్తున్నారని, దీనిపై ఇంత వరకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించలేదని పేర్కొన్నారు. ఎటువంటి నష్టపరిహారం ప్రకటించకుండా ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్నీ, రైతులను నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు అన్ని వర్గాల ప్రజల సమస్యలు పరిష్కారం చేస్తామని, రైతులు ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యమని ఊక దంపుడు ఉపన్యాసాలతో ఓట్లు పొంది అందలమెక్కగానే వాగ్దానాలకు తిలోదాకాలిచ్చారని,రైతాంగ, కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని విమర్శిచారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతాంగాన్ని స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేసి ఆదుకోవాల్సిన ఉందన్నారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, దీనికి సంబంధించి బిల్లు తీసుకురావాలని, రైతులు, రైతు సంఘాల నాయకులు చేస్తున్న విజ్ఞప్తిని పట్టించుకోకుండా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలు కట్టబెట్టాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో రైతులకు ఎటువంటి రాయితీలు అమలు కావడం లేదని, రైతు భరోసా కేంద్రాలు ద్వారా విత్తనం దగ్గర నుండి పంట కొనుగోలు వరకు చేసే పూర్తి బాధ్యత నిర్వహిస్తామని ప్రకటించిన ప్రభుత్వ హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయని అన్నారు.

సాగర్ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సాగునీరు విడుదల చేసి ఎండుతున్న పంటలను కాపాడాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సత్తెనపల్లి మండలం నందిగామ లో మిర్చి పంటలను టిడిపి నాయకులు ఆదివారం పరి శీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జలవనరుల శాఖా మంత్రి గాని ముఖ్యమంత్రి గాని రైతులు గోడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ట్యాంకర్లు ద్వారా సాగునీరు పెట్టు కోవా ల్సిన దుస్థితి రాష్ట్రంలో ఏర్పడిందని, ఇప్పటికే మిర్చిరైతులు సుమారు లక్షరూపాయలు పెట్టారని సాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారని అన్నారు. తక్షణం సాగర్ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పీలా సాంబశివరావు,కోయ లక్ష్మయ్య, బడ్డారుపల్లి నరసింహారావు పాల్గొన్నారు.

పశువులకు కృత్రిమ గర్భధారణ మేలు

వ్యాధులకు గురవకుండా దూడలూ ఆరోగ్యంగా ఉంటాయి : ఎడిఎ అపర్ణ

ప్రజాశక్తి - దుగ్గిరాల

గేదెల గర్భధారణకు సీజన్ ప్రారంభమైనదని, గేదెలు చలికాలంలో ఎదకు వస్తాయని దుగ్గిరాల ఎడిఎ ఆర్.అపర్ణ తెలిపారు. ఈ నేపథ్యంలో మండలంలోని పశువుల వైద్యశాలల్లో కృత్రిమ గర్భధారణ చేస్తున్నట్లు చెప్పారు. మండల కేంద్రమైన దుగ్గిరాలలోని పశు వైద్యశాలతో పాటు చిలువూరు, పేరుకలపూడి, పెద్దపాలెం పశు వైద్యశాలల్లో ఈ అవకాశం ఉందని, పాడి రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కృత్రిమ గర్భధారణ వల్ల పశువులు, పుట్టే దూడలు ఆరోగ్యవంతంగా ఉంటాయని, జబ్బు లేని ఆరోగ్యవంతమైన మేలు జాతి దున్న వీర్యాన్ని శాస్త్రీయ పద్ధతిలో సేకరించి కృత్రిమ గర్భధారణకు వినియోగిస్తామని తెలిపారు. దున్నల నుండి సేకరించిన వీర్యాన్ని కర్నూలు, విశాఖపట్నం, నంద్యాల, కర్ణాటక రాష్ట్రంలోని బన్వాస్సీ ప్రాంతాల నుండి సరఫరా అవుతున్నట్లు తెలిపారు. ఈ పద్ధతి ఎంతో సురక్షితమైందన్నారు. అయితే అనారోగ్యంగా ఉన్న, బలహీనంగా ఉన్న గర్భవాతమున్న పశువులకు గర్భధారణ చేయించొద్దని చెప్పారు. కృత్రిమ గర్భధారణ చేయించిన పశువులకు మూడ్రోజులపాటు విశ్రాంతినిచ్చి ఉద్రేకానికి గురి కాకుండా జాగ్రత్త తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కృత్రిమ గర్భధారణ ఉన్న గేదెలకు అనారోగ్యమేమీ ఉండదన్నారు.

తీసుకోవలసిన జాగ్రత్తలు

ఈనడానికి వారం రోజుల ముందు నుంచే దాణా పెంచుకుంటూ పోవాలి. ఏ జబ్బు అయినా క్రింది నుంచి పైకి పాకుతుంది. పశువులను కట్టేసే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలి. క్రమం తప్పకుండా షెడ్డు శుభ్రం చేయాలి. పొదుగు వాపు రాకుండా పరిశుభ్రత పాటించాలి. దాణా, గడ్డి సక్రమంగా వేస్తే కాల్షియం లోపం ఉండదు. క్యాల్షియం లోపం ఉంటే పాలు తగ్గుతాయి. రోజుకు 15 గ్రాములు దాణా పెంచుకుంటూ పోవాలి. ఈనిన తర్వాత ఐదు వారాల వరకు పాలు పెరుగుతాయి. దీనిని పీక్ ప్రొడెక్షన్ అంటారు. ఈ కాలం ఐదు నుండి 8 వారాలు ఉంటుంది. తర్వాత పాలు తగ్గి పశువు మళ్లీ ఎదకు వస్తుంది. ఈనిన 70 రోజులకే ఎదకు వస్తుంది. ఎద కట్టిన ఏడు నెలల వరకు పాలిస్తుంది. పుట్టిన దూడకు 8 వారాలపాటు పాలు అవసరమవుతాయి. కొంతమంది మధ్యలోనే దూడకు పాడు పట్టించటం నిలిపివేస్తారు. దీనివల్ల అది బలహీనమవుతుంది. గేదెలకు దోమల బారిన, జబ్బుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే ఏ సమయంలోనైనా పశువుల వైద్యుని సలహా మేరకే వైద్యం చేయించాలి.. అని ఎడిఎ వివరించారు.

మాట్లాడుతున్న భరత్‌రెడ్డి

ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

వ్యవస్థాపకుడు-నాయకత్వం అనే అంశంపై మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజిలో ఒకరోజు సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రాగ్మాటిక్ సిస్టమ్స్ అధినేత జి.భరత్‌కుమార్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. భవిష్యత్ టెక్నాలజీ రంగంలో వచ్చే మార్పుల గురించి, అన్ని రంగాల్లో ఐటి రంగం ప్రాముఖ్యత గురించి విద్యార్థినులకు వివరించారు. ప్రతి రంగం నేడు ఐటి టెక్నాలజీపై ఆధారపడి ఉందని, ప్రతి రంగం ఐటి రంగంలో విలీనమైందని చెప్పారు. ప్రస్తుత టెక్నాలజీలో రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్ రంగాలు అభివృద్ధి సాధిస్తున్నాయని, వాటిని ఆకళింపు చేసుకొని వారి కెరీర్‌ను మరింతగా వృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మలినేని విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎం.పెరుమాళ్లు, ప్రిన్సిపాల్ జె.అప్పారావు, సిఎస్ఇ హెడ్ రామస్వామి పాల్గొన్నారు.

బిసిలకు ఎక్కువ సీట్లు కేటాయించండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో బిసిలకు అన్ని పార్టీలు ఎక్కువ సీట్లు కేటాయించాలని బిసి కులాల రాజ్యాధికార సాధన వేదిక రాష్ట్ర కన్వీనర్ జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. 2024 లో బీసీలు అసెంబ్లీ ఎలక్షన్లో పోటీ చేసేందుకు బీసీలను చైతన్యం చేసేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. స్థానిక అరండల్‌పేట మొదటి లైనులో ఆదివారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మినీ హాల్లో జరిగిన సమావేశంలో బిసిలకు రాజ్యాధికారంపై చర్చించారు. బిసిలకు తగిన ప్రాధాన్యత దక్కేలా కృషి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గతనెల 19న అవినిగడ్డ నియోజకవర్గంలో కె.కొత్తపాలెంలో యానాదులపై దాడులను ఖండిస్తూ యానాదులకు సపోర్టుగా నిలబడాలని సమావేశం సమావేశంలో తీర్మానం చేసినట్టు ఆయన తెలిపారు. సమావేశంలో నాయకులు వై.కోటేశ్వరరావు, బిసి ఉద్యోగస్తుల రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పివి రమణయ్య, బీసీ మహాజనసభ రాష్ట్ర అధ్యక్షులు ఉగ్గం సాంబశివరావు, బహుజన మహాసభ జాతీయ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జిఆర్ భగత్‌సింగ్, బీసీ నాయకులు జె.హనుమంతరావు గౌడ్, రజక మహిళా నాయకురాలు పి.రమాదేవి, బీసీ నాయకులు ఎ.రామరాజు జి.శ్రీనివాసరావు పాల్గొని త్వరలో ఒక సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు.

దంత సమస్యలతో ఇతర రోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

దంత సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదని, ఆ నిర్లక్ష్యం భవిష్యత్‌లో రకరకాల అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. దంత సమస్యలపై ఆరోగ్య సభ అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దంత సమస్యలలో పళ్లు పుచ్చటం, చిరుగు ఇన్ఫెక్షన్ సమస్యలు ఉంటాయన్నారు. తినే చాక్లెట్లు, పంచదార, పులుపు ఆహార పదార్థాల వల్ల పంటిపై ఉండే ముఖ్యమైన పింగాణిపొర దెబ్బతింటుదని, పుచ్చు ఏర్పడి, తద్వారా పంటినొప్పి సంభవించి, ఆహారం సరిగా తీసుకోలేక అనారోగ్య సమస్యలకు గురవుతారని వివరించారు. బలవంతంగా ఆహారం తింటే అది అరగక, మలబద్ధకం, అజీర్ణం లాంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. పళ్లకు గారపడితే వెంటనే శుభ్రం చేయించుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా పళ్లు శుభ్రం చేయించుకోవాలన్నారు. తినే ఆహార పదార్థాల వల్ల మన పళ్లు దెబ్బతినకుండా క్లోరోథెరపి అనే అధునాతన పద్ధతులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పిల్లలు నోటిలో వేలు వేసుకునే అలవాటు మాన్పించకుంటే ఎత్తు పళ్లు వస్తాయన్నారు. మధుమేహం వల్ల పళ్లు వదులు అవుతాయన్నారు. పళ్లలో ఏదైనా ఆహారం ఇరుక్కున్నపుడు పుల్లలు, పిన్నీసులతో తీసే ప్రయత్నం చేయకూడదని తెలిపారు. గర్భిణులకు ఏదైనా దంత సమస్యలు వస్తే నాలుగో నెల నుండి ఎనిమిదో నెల మధ్యలో వైద్యం చేస్తారని అన్నారు. ఫిజియోథెరపిస్ట్ లక్ష్మీ లావణ్య మాట్లాడుతూ నొప్పులు, కండరాల పట్టుకుపోవటం లాంటి సమస్యలకు ఫిజియోథెరపీ ద్వారా చక్కని వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు. శారీరక శ్రమ చేయాలని, ఫిజియోథెరపి ద్వారా దుష్ప్రభావాలు ఉండవని చెప్పారు. కార్యక్రమంలో ఎ.వి.రామారావు, వి.వి.రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి

దిగంబర కవిత్వానికి సంస్కరణ పైగంబర కవిత్వం

ప్రజాశక్తి-గుంటూరు

దిగంబర కవిత్వ ఉద్యమానికి సంస్కరణ కవిత్వమే పైగంబర కవిత్వ ఉద్యమం అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రావి రంగారావు అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఒ సమావేశ మందిరంలో ఆదివానం సాహిత్య సభ నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త అబ్దుల్ రజా హుస్సేన్ రచించిన 'పైగంబర కవిత్వం - ఒక పరిశీలన' గ్రంథాన్ని రావి రంగారావు ఆవిష్కరించి, ప్రసంగించారు. దిగంబర కవిత్వం అత్యావేశంతో, అశ్లీలంతో పాఠకులకు ఇబ్బంది అనిపిస్తే స్థిరమైన ఆవేశంతో అశ్లీలం పరిహరించి ప్రజల్ని విప్లవ మార్గంలో నడిపించటానికి ఎగసిన ఉద్యమ కెరటం పైగంబర కవిత్వం అని అన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు గ్రంథాన్ని సమీక్షిస్తూ ఎం.కె. సుగంబాబు సారథ్యంలో పైగంబర కవిత్వ ఉద్యమం ప్రారంభమైందని తెలిపారు. సుగం బాబుతో పాటు దేవీప్రియ, ఓల్గా, కమలాకాంత్, కిరణ్‌బాబు తదితర కవులు పైగంబర కవులుగా ముందుకొచ్చి పైగంబర కవిత్వ సంకలనాలని తీసుకొచ్చారన్నారు. పైగంబర కవులు ప్రచురించిన 'యుగ సంగీతం', 'యుగ చైతన్యం' కవిత్వ సంకలనాలను గురించి రచయిత చక్కగా విశ్లేషించారన్నారు. ఐదుగురు కవుల కవిత్వాన్ని రజా హుస్సేన్ చక్కగా వివరించారని మెచ్చుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆలీఘర్ ముస్లిమ్ విశ్వ విద్యాలయం విశ్రాంత ప్రాచార్యులు ప్రొఫెసర్ షేక్ మస్తాన్ మాట్లాడుతూ పైగంబర కవిత్వ ఉద్యమం విప్లవ కవిత్వ ఉద్యమం లక్ష్యాలు ఒక్కటి కావడం విశేషమన్నారు. నయాగరా కవులు, రాత్రి కవులు, తిరగబడు కవుల కంటే స్థిరమైన కవిత్వ రూపాన్ని పైగంబర కవిత్వం సంతరించుకుందని చెప్పారు. గ్రంథ రచయిత అబ్దుల్ రజా హుస్సేన్ మాట్లాడుతూ పైగంబర కవిత్వం కూడా సాహిత్య చరిత్రలో ఒక గొప్ప మలుపుగా భావించి ఈ రచన చేశానని చెప్పారు. అనంతరం ఈమాసం కవి సిరిపురపు అన్నపూర్ణను, పుస్తక రచయితను సాహితీవేత్తలు సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ పింగళి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

పట్టణంలో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

తెనాలిని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుదాం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పునీత్ సాగర్ అభియాన్ 2023-24 లో భాగంగా పాఠశాల విద్యార్థులు ఆదివారం సచ్ఛ భారత్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల, అంబేద్కర్ కళాశాల విద్యార్థులుతో నిర్వహించిన ర్యాలీలో ఎన్‌సిసి అధికారులు సామ్యా నాయక్, పరిశా సర్దార్ పర్యవేక్షించారు. 22(ఎ) బెటాలియన్ ఎన్‌సిసి కేడెట్లు పలు వీధులు తిరుగుతూ డస్ట్‌బిన్ ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. పనికిరాని, కుళ్లిన వ్యర్థాలు బయట పడేయకుండా డస్ట్ బిన్ వాడాలని అధికారులు సూచించారు. ప్రధానంగా ప్లాస్టిక్ వ్యర్థాలు కారణంగా సముద్ర జలాలు, నదులు, కలుషితం అవుతున్నాయని చెప్పారు. నీటి వనరుల పరిరక్షణ, పరిశుభ్రత అందరి బాధ్యతన్నారు. డస్ట్ బిన్ ఆకారంలో వినూత్నంగా నిర్వహించిన ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో కొత్తపేట బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం షేక్ మౌలాబి, అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధీర్, కరస్పాండెంట్ మేరీ గ్రేస్, 22వ ఆంధ్ర బెటాలియన్ పిఐ స్టాఫ్ నాయక్, సుబేదార్ దేవేందర్ సింగ్, హవాల్దార్ కుష్బీర్‌సింగ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులతో కళాశాల కరెస్పాండెంట్ నన్నపనేని సుధాకర్

40 ఏళ్ల తర్వాత ఒకే చోటకు!

విఎస్ఆర్ అండ్ ఎన్‌విఆర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఒకప్పుడు విద్యార్థులుగా ఒకే బెంచీలో పక్కపక్కన కూర్చునవారు ఇప్పుడు వివిధ హోదాల్లో ఒకేచోటకు కూడారు. కొంతమంది డాక్టర్లు, మరికొంత మంది ప్రభుత్వ ఉద్యోగులుగా, వ్యాపారం, ఇతర రంగాల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ జి.రాధారాణి పూర్వ విద్యార్థినిగా ఈ సమ్మేళనంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రముఖ వ్యాపారవేత్త ఆర్కె రెడ్డి ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. తెనాలి విఎస్ఆర్ అండ్ ఎన్విఆర్ కళాశాలలో 1979-82 బ్యాచ్ బీఎస్సీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. పరస్పర పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరవేసుకుంటూ ఈ ఘటనలను తమ సెల్‌ఫోన్లలో బంధించుకున్నారు. నాటి గురువులకు ఘన స్వాగతం పలకడంతోపాటు సత్కరించారు. డాక్టర్ ఎన్.పాపారావు, కోసరాజు వెంకటరావు, ఎ.రాజేశ్వరి, కొలసాని శ్రీరాములు, నన్నపనేని సుగుణ, కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, ప్రిన్సిపాల్ రవీంద్రను సన్మానించారు. అన్నపరెడ్డి కోటిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్.విజయానంద్, డివి కృష్ణారావు, ఆర్ఎన్ రాజేశ్వరి, డాక్టర్ పి.సుధారాణి, విశ్వేశ్వరరావు, ప్రమీల, కృష్ణారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

చంద్రబాబుపై సజ్జల ఆరోపణలు తగదు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పై వైసిపి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి కుట్రపూరితంగా ఆరోపణలు చేస్తున్నారని సత్తెనపల్లి తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు విమర్శించారు సత్తెనపల్లి ప్రజా వేదిక లో న్యాయవాదులు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ఆరోగ్యం పై డాక్టర్లు ఇచ్చిన వైద్య నిర్ధారణకు వ్యతిరేకంగా ప్రజలను ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తూ ఏ మాత్రం వైద్య పరిజ్ఞానం లేని సజ్జల రామకృష్ణారెడ్డి చంద్రబాబు వైద్యం గురించి మాట్లాడటం కుట్ర పూరిత ఆరోపణ అని అన్నారు. సజ్జల పదేపదే తప్పుడు ప్రకటనలు చేస్తున్నందున పదవికి అనర్హుడని, సభా హక్కుల క్రింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గవర్నర్ స్పందించి సజ్జలను తొలగించాలని కోరారు. సమావేశంలో న్యాయవాది బొక్క సంగీతరావు పాల్గొన్నారు.

బీసీ సంఘాల సమావేశం జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పెదకూరపాడు

నరసరావు పేటలో టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశాన్ని జయప్రదం చేయాలని టిడిపి శాలివాహన సాధికార సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు మోదుగుల చంద్రశేఖర్ కోరారు. ఆదివారం పెదకూరపాడు మండలం కన్నెగండ్ల గ్రామంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని అన్ని బీసీ సంఘ నాయకులు కార్యకర్తలు హాజరు కావాలన్నారు. బీసీలపై జరుగుతున్న దాడులు గురించి, రానున్న ఎన్నికలలో బీసీల పాత్రగురించి చర్చించనున్నట్లు చెప్పారు.

వైసిపి నుండి టిడిపిలోకి..

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణానికి చెందిన 40 కుటుంబాలు కు చెందినవారు ఆదివారం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి బ్రహ్మ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులు నా ఎస్సీలు నా బీసీలు నామైనారిటీలు అంటూ వారికే అన్యాయం చేస్తున్నారని విమర్శించారు ప్రశ్నిస్తే దాడులు చేయడం కేసు నమోదు చేయటం స్టేషన్లో పెట్టి కొట్టించడం మాచర్ల నియోజకవర్గంలో పరిపాటిగా మారిందన్నారు వైసీపీ వాళ్ల దాడులకు గురైన వారంతా టిడిపి తో కలిసి పోరాడేందుకు సిద్ధం కావాలన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దుర్గారావు అన్వర్ తదితరులు పాల్గొన్నారు

వైసిపి ఫ్లెక్సీ చించివేత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలో నేడు జరగనున్న సామాజిక బస్సుయాత్ర పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. ఈ ఘటన ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. "సామాజిక బస్సు యాత్ర"కు స్వాగతం పలుకుతూ విజయవంతం చేయాలని కోరుతూ నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేరిట రావిపాడు రోడ్ లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకం

నరసరావుపేటలో..

చిలకలూరిపేటలో..

మాచర్లలో..

పెదకూరపాడులో..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని నేటి ఆధునిక యుగంలో మహిళలు పురుషులతో అన్ని రంగాలలో రాణిస్తున్నారని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిణి ఎ.దీప్తి అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నరసరావు పేటలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం దిశా చట్టం, మహిళా సాధికారత పై అవగాహన సదస్సు నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ,ఝాన్సీ లక్ష్మీ భాయ్ ల జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ నేడు ఉద్యోగ,వ్యాపార, ఉపాధి, కుటుంబ, వ్యవసాయ తదితర రంగాలలో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నారని చెప్పారు. అయినప్పటికీ సమాజంలో కొంత మేర వివక్షకు గురి కావాల్సి వస్తోందని అన్నారు. మహిళలు ఇంకా చైతన్యవంతులుగా తయారై సమాజంలోని వివక్షను సైతం ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం పల్నాడు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి లోతేటి వరలక్ష్మి మాట్లాడుతూ ఇందిరా గాంధీ, ఝాన్సీ లక్ష్మీ భాయ్ వంటి మహిళలను స్ఫూర్తిగా తీసుకొని ధైర్యంగా అన్ని రంగాలలో మహిళలు రాణించాలని సూచించారు. పల్నాడు జిల్లా గనుల , భూగర్భ శాఖాధికారిణి వి.నాగిని మాట్లాడుతూ మహిళలు ఎంతగా రాణిస్తున్నా మహిళలపై వివక్ష దాడులు పెరిగిపోవడం బాధాకరమన్నారు. ప్రతి మహిళ తన మొబైల్ లో యాప్ డౌన్ లోడ్ చేసుకొని ఆపత్కాల సమయంలో రక్షణ పొందాలని, తెలివిగా ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. గ్రంథాలయ అధికారిణి యడ్లపాటి రాధా మాట్లా డుతూ ప్రతిభ చాటిన విద్యార్థులకు నేడు (సోమవారం) వారోత్సవాల ముగింపు సభలో బహుమతి ప్రధానం చేయనున్నట్లు చెప్పారు.గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రంగోళి పోటల్లో పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన బాలికలు పాల్గొన్నారు. అభ్యుదయ భారతీయ అధ్యక్షులు రత్నాకరం రాము, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక శాఖా గ్రంథాలయంలో మహిళా దినోత్స వం జరిగింది. ఈ సందర్భంగా యంగ్ మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ నిర్వహణలో కార్యక్రమాలు జరిగాయి. ఆ సంస్థ మాజీ అధ్యక్షులు చుక్కా విన్సెంట్ పాల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యురాలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ వై.మధులత హాజరయ్యారు. మదర్ థెరిస్సా, సావిత్రి బాయి పూలే, ఝాన్సీ లక్ష్మీ బాయి, ఇందిరా గాంధీ వంటి మహిళా మూర్తు లను ఆదర్శంగా తీసు కుని, వారి జీవిత చరిత్రలు చదవాలని మధులత అన్నారు. తొలుత గ్రంథాలయ ప్రముఖుల చిత్ర పాఠాలకు పూల దండలు వేసి నివాళులు అర్పించారు విద్యార్థులకు దిశ చట్టం పై చర్చ, పో టీ, , బాలికలకు ముగ్గుల పో టీ నిర్వహిం చారు. కార్యక్రమంలో చుక్కా విన్సెంట్ పాల్ తో పాటు, వై. ఎమ్.సి.ఏ. పట్టణ అధ్యక్షులు రా మ్మోహన్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సాహితీ వేత్తలు డా.పివి సుబ్బారావు, దార్ల బుజ్జిబాబు, గ్రంధా లయ ఇంచార్జ్ అధికారి ఎమ్.నాగుల్ మీరా వలి పా ల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

గత చరిత్ర ఏమిటో తెలుసుకోకుండా భవిష్యత్తుకు బాటలు వేసుకోలేమని రచయిత పావులూరు సతీష్ అన్నారు స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సతీష్ కు సన్మానం చేశారు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పుల్లారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సతీష్ మాట్లాడుతూ విద్యార్థులలో శోధనాత్మకత ఉండాలని అన్నారు. కొత్త వాటిని తెలుసుకోవాలన్న ఆలోచన ఉన్నప్పుడే వారిలో విజ్ఞానం పెరుగుతుందన్నారు. మన చుట్టూ ఉండే విషయాలను తెలుసుకోవడంతో పాటు కొత్త కొత్త విషయాలను కూడా మనకందు బాటలో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేర్చుకోవాలన్నారు అందుబాటులో ఉన్న గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మాచర్లకు ఎంతో గొప్ప చరిత్ర ఉన్నదని ఆ చరిత్ర మరుగున పడిపోతున్నడంతో చెన్నకేశవ స్వామి దేవాలయం గురించి పలు అంశాలపై పుస్తకాలు రాసినట్లు చెప్పారు. అనంతరం ఉపాధ్యాయ సం ఘం నాయకులు జి.కిరీటి రెడ్డి మాట్లా_డారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సం ఘం నాయకురాలు ఆయేషా సుల్తానా గ్రంథాలయ కమిటీ మెంబర్ శ్రీనివాస రావు, గ్రంథాలయ అధికారి ఫణి, సంగీత విద్వాంసులు లాలూసాహెబ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పెదకూరపాడు

మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పెదకూరపాడు మహిళా పోలీస్ విమల అన్నారు. (పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దిశా చట్టం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి గ్రంధాలయ అధికారి వాణి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

సేవా మార్గంలో నడిచేందుకు 'సంకల్ప సేవా సమితి'

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గంలోని ఔత్సాహిక యువతను కలుపుకొని సేవా మార్గంలో నడిచే విధంగా, సాటి మనిషికి సాయపడే గొప్ప సంకల్పంతో నూతనంగా సంకల్ప సేవా సమితిని సంస్థను స్థాపించామని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ జానీ భాష(జిమ్ జానీ) అన్నారు. సంస్థలో మొదటి కార్యక్రమంగా స్థానిక విఠం రాజుపల్లిలోని ఉషోదయ సెయింట్ ఆన్స్ బధిరుల పాఠశాలలో చిన్నారులకు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థినీ విద్యా ర్థులకు పుస్తకాలు, పెన్నులు, పంపిణీ చేశామన్నారు. ఇదేవిధంగా భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, నియోజకవర్గంలోని ప్రజ లందరూ సహకరించాలని కోరారు. సంకల్ప సేవా సమితి గౌరవ అధ్యక్షులుగా గురజాల వెంకటేశ్వరరావు , ప్రముఖ న్యాయవాది షేక్ సిద్దయ్య, జాయింట్ సెక్రటరీగా షేక్ అక్బర్ బాషా , ట్రెజరర్ గా కొండా శ్రావణ్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోగా కార్యవర్గ సభ్యులుగా మరి కొంతమందిని ఎన్నుకున్నట్లు చెప్పారు.

'అభివృద్ధి చేయడం చేతగాని ప్రభుత్వం'

ప్రజాశక్తి-నాదెండ్ల

కూల్చడం తప్ప అభివృద్ధి చేయడం చేతగాని జగన్ ప్రభుత్వ పనితీరుకి సాతులూరు లో అసంపూర్తిగా ఉన్న డంపింగ్ యార్డే ఉదాహరణ అని టిడిపి నాయకులు విమర్శించారు. డంపింగ్ యార్డును వినియోగించుకోవడం కూడా ప్రభుత్వానికి చేతకాదని అన్నారు. సాతులూరులో ఉపాధి హామీ నిధులతో ఏర్పాటైన డంపింగ్ యార్డ్‌ను నాదెండ్ల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ పరిశీలించారు.



ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-బెల్లంకొండ

నాగిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ వలికి గంగిరెడ్డిపాలెం బిసి పాయింట్ సంఘం డెయిరీ మేనేజర్ శ్రీనివాసరావు ఇన్సూరెన్స్ చెక్కును ఆదివారం అందజేశారు. మస్తాన్ వలి భార్య మహబూబ్ ఇటీవల కాలంలో అనారోగ్యంతో మతి చెందింది. ఆమె నాగిరెడ్డి పాలెం సంగం డెయిరీ పాల కేంద్రంలో సభ్యురాలుగా ఉండటంతో ఆమె భర్తకు రూ.60 వేల రూపాయల చెక్కును నాగిరెడ్డి పాలెం సంఘం డైరీ పాల కేంద్రం అధ్యక్షుడు సీతారామిరెడ్డి, రెంటపాళ్ళ బీసీ పాయింట్ సంఘం డైరీ మేనేజర్ గోపి, సూపర్వైజర్లు సుధీరు, సాయి ఆధ్వర్యంలో గ్రామస్తులు బూతుకూరి తిరుపతిరెడ్డి, గోవిందరెడ్డి , శ్రీహరి, కిచ్చా రెడ్డి , బద్దూరి వీరారెడ్డి సమక్షంలో అందజేశారు.

దిశ చట్టం, మహిళా సాధికారతపై అవగాహన

డాక్టర్ పల్లవిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - తెనాలి

ఈనెల 14 నుంచి ప్రారంభమైన 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో మహిళా సాధికారత అంశంపై మహిళా దినోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ పల్లవి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, స్వీయ రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్‌ని కూడా ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం క్విజ్ పోటీలు, మహిళా సాధికారతపై డిబేట్ పోటీలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ పల్లవిని గ్రంథాలయాధికారి కె. రమాదేవి సత్కరించారు. కార్యక్రమంలో వై.హనుమంతరావు, వి.సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు. సోమవారం జరిగే ముగింపు సభలో అన్ని పోటీల్లో విజేతలకు బహుమతులు అందించనున్నట్లు రమాదేవి చెప్పారు. పెదరావూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎ.రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో మహిళ సాధికారతపై విద్యార్థులకు చిత్రలేఖనం, ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సరళ, డ్రాయింగ్ ఉపాధ్యాయులు వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ధనలక్ష్మి, భవానీ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 6వ రోజు మహిళా దినోత్సవం, ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. జిల్లా అడిట్ అధికారి బి.ధనలక్ష్మి, గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ బి.వాసిరెడ్డి భవాని, ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. విద్యార్థులకు దిశా చట్టం, మహిళా సాధికారతపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మెహందీ పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకులు ఎన్.నాగిరెడ్డి, ఐ.వి.దుర్గారెడ్డి, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

మనిషిని మహోన్నతునిగా మార్చగలిగే శక్తి పుస్తకానికే ఉందని వక్తలు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పుస్తక పఠంపై ఆసక్తి అనే అంశంపై సభ నిర్వహించారు. సినీ దర్శకులు రచయిత కె.జయకుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాల వినియోగంతో అందరికీ చదవడం అలవాటుగా మారటం శుపరిణామం అన్నారు. పుస్తకాలు కొలువుండే ఆ అక్షరాలయంతో మానవ మేధస్సు, చురుకుదనం పెరుగుతుందన్నారు. విజ్ఞాన వితరణలో గ్రంథాలయాల విశేష కృషి , విధి నిర్వహణలో లైబ్రేరియన్ల అకుంఠిత దీక్ష లైబ్రరీ సేవలందించే సిబ్బంది నిస్వార్థ సేవాగుణాలు ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా యువతను పుస్తక పఠనం వైపు ఆకర్షించడం, అన్ని రకాల పుస్తకాలను పత్రికలను అందుబాటులోకి ఉంచటం తదితరాలపై కాలేజీలు, స్కూల్స్ ప్రత్యేక కృషి చేయాలన్నారు. న్యాయవాది అవదానుల హరి మాట్లాడుతూ పుస్తక పఠనంతో విశ్వదర్శనం, మానసిక మేధో వికాసం, బంగారు భవిష్యత్తు నిర్మాణం, సమాజ గుర్తింపు ప్రయోజనాలు ఒనకూరుతాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఇంజినీరు ఎన్.సదాశివం, విశ్రాంత అధికారి మల్లేశ్వరరావు, గాయకులు మురళీకృష్ణ ప్రసంగించారు.

మాట్లాడుతున్న జయకుమార్

రికార్డులను పరిశీలిస్తున్న పీర్ అహ్మద్

ప్రజాశక్తి - మేడికొండూరు

విజ్ఞాన కేంద్రాలైన గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ సంస్థ డిప్యూటీ డైరెక్టర్లు పీర్ అహ్మద్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మేడికొండూరు గ్రంథాలయాన్ని ఆయన ఆదివారం సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు మెహందీ పోటీలు నిర్వహించారు. కె.ఝాన్సీ, సుధారాణి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఇందిరాగాంధి చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పిస్తున్న డాక్టర్ ప్రియాంక తదితరులు

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

గ్రంథాలయాలకు వచ్చి అక్కడ ఉన్న పుస్తకాలు చదువుకొని దేశంలో ఉన్నత స్థితికి వెళ్లిన మహిళల జీవిత చరిత్రను తెలుసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని విద్యార్థులకు గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ప్రియాంక సూచించారు. పెదకాకానిలోని గ్రంథాలయంలో నిర్వహించిన వారోత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. పోటీలను గ్రంథాలయాధికారి విజయ్ పర్యవేక్షించారు.

ప్రజాశక్తి - మంగళగిరి

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మంగళగిరి శాఖా గ్రంథాలయంలో దిశ చట్టం, మహిళా సాధికారతపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. కె.లలితారెడ్డి మాట్లాడుతూ దిశా చట్టంపై ఉపయోగించుకునే తీరు, ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో నవీన్, ఎస్.కె ఫిరోజ్, నజీమా, గ్రంథాలయ సిబ్బంది ఎన్.ఆరోగ్యం, పి.కృష్ణ, అబ్దుల్ గఫూర్ పాల్గొన్నారు.



ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూలమాలలేసి నివాళి అర్పిస్తున్న గ్రంథాలయాధికారి గిరిధర్ కుమార్

ప్రజాశక్తి - తుళ్లూరు

స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలికలకు దిశ చట్టం, మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. రంగవల్లులు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. తొలుత మాజీ ప్రధాని ఇందిరాగాంధి చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పించారు. గ్రంథాలయాధికారి టి.గిరిధర్ కుమార్, అంగన్వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, స్థానిక పిహెచ్‌సి స్టాఫ్ నర్స్ సుమతి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

ప్రజాశక్తి-తాడేపల్లి

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి విశేష స్పందన వచ్చినట్లు గ్రంథాలయ అధికారి ఎస్‌కె నాగూర్ బాష తెలిపారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయానికి సందర్శకుల తాకిడి

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్ : కార్తీకమాసము మొదటి ఆదివారం సందర్భంగా పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయానికి సందర్శకులు అధికంగా తరలివచ్చారు. సందర్శకులకు ఇబ్బందులు రాకుండా ఆలయంలో ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేశారు. పెదకాకాని పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసరు సురేష్‌బాబు ట్రాఫిక్ నియంత్రణను పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా వివిధ సేవా రుసుముల ద్వారా రూ.2 లక్షల 80 వేల 310, ప్రసాద విక్రయం ద్వారా రూ.1.59 లక్షలు ప్రత్యేక దర్శనం ద్వారా రూ.లక్షా 20 వేల 450, నిత్య అన్నప్రసాద విరాళం ద్వారా రూ. 66,080, ఇతర సేవలు ఆదాయం కలిపి రూ.6 లక్షల 65 వేల 900 వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు ఎన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

రామారావుకు నగదు సాయం అందిస్తున్న టిడిపి నాయకులు

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

చిర్రావూరుకు చెందిన టిడిపి అభిమాని కొంకా రామారావు ఇటీవల అనారోగ్యానికి గురై, ఆపరేషన్ చేయించుకుని ఇంటిదగ్గర ఉంటున్నారు. విషయం తెలుసుకున్న చిర్రావూరు గ్రామ టిడిపి నాయకులు ఆదివారం రామారావును పరామర్శించి, వైద్య ఖర్చులకు రూ.5 వేల సాయాన్ని టిడిపి గ్రామ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి పి.రమేష్, ఎం.కిరణ్, ఎం.రవి, సీనియర్ నాయకులు పి.పాములు, ఎన్.శ్రీనివాసరావు, పి.నాగయ్య పాల్గొన్నారు.

సహకార జెండా ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

ఘనంగా జాతీయ సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక కొత్తపేటలోని ది తెనాలి పి అండ్ టి సహకార సొసైటీ కార్యాలయంలో 70వ జాతీయ సహకార వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి నిర్మలాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహకార జెండాను సొసైటీ అధ్యక్షులు వి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. నిర్మలాదేవి మాట్లాడుతూ సహకార సొసైటీలు ఎంతో ప్రాధాన్యతను సంచరించుకున్నాయని, వారోత్సవాల నిర్వహణ ప్రాధాన్యతను ఆమె వివరించారు. సొసైటీ సీఈఓ డిఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సొసైటీ 60 ఏళ్ల పూర్తి చేసుకుని 61వ వసంతలోకి అడుగుపెట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి భాగ్యరాజు, కోశాధికారి పోతురాజు, సొసైటీ సభ్యులు, రిటైర్డ్ పోస్టల్ అండ్ టెలికాం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆటపాటలతో సందడి

ప్రజాశక్తి-తాడేపల్లి

కార్తీక మాసం సందర్భంగా తాడేపల్లి సుందరయ్య నగర్‌లో మానససరోవం పిరమిడ్ కేంద్రంలో ఆట పాట నిర్వహించారు. ఎటువంటి మాటలు ప్రసంగాలు లేకుండా ఆహ్లాదకరంగా గడిపారు. ఎవరికి నచ్చిన పాట వారు పాడి తమ ప్రతిభ కనబరిచారు. కొంతమంది హాస్య చలోక్తులు విసిరారు. చిన్నారులు డ్యాన్స్ చేశారు. సంధానకర్తగా రఘు వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రదీప్, త్రివేణి, సరోవరం నిర్వాహకులు రామిరెడ్డి పాల్గొన్నారు.

ఛాంపియన్‌షిప్‌ను అందుకుంటున్న గుంటూరు జిల్లా మహిళల జట్టు

బాస్కెట్‌బాల్ పోటీల్లో గుంటూరు మహిళల జట్టు గెలుపు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్శిటిలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న 1వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. మహిళల విభాగంలో గుంటూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఫైనల్స్‌లో విశాఖ జిల్లా జట్టుపై 40-31 పాయింట్లతో గుంటూరు జిల్లా జట్టు జయకేతనం ఎగురవేసింది. ఉదయం జరిగిన మహిళల సెమీఫైనల్స్‌లో గుంటూరు జిల్లా జట్టు తూర్పుగోదావరి పైనా విశాఖ జిల్లా జట్టు కడప జిల్లా జట్టుపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. పురుషుల విభాగంలో సెమీఫైనల్స్‌లో ఏలూరు జిల్లాజట్టుపైన విశాఖ జిల్లా జట్టు గెలుపొందగా అనకాపల్లి జట్టుపై నంద్యాల జిల్లా జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరాయి. విశాఖ, నంద్యాల జిల్లా జట్ల మధ్య మ్యాచ్‌లో 59-55 పాయింట్లతో విశాఖ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. అనంతరం విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శాయ్ రిటైర్డ్ బాస్కెట్ బాల్ చీఫ్ కోచ్ సాయిబాబా, రిటైర్డ్ డీఎస్పీ మదన్ మోహన్, ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.హరికృష్ణ ప్రసాద్, జనరల్ సెక్రెటరీ కె.రాజేంద్రప్రసాద్, వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పి.జాన్సన్, జి.వి.ఎస్ కృష్ణారెడ్డి, వి.విష్ణు మోహనరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య బలోపేతం.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం

- ఈ రెండు లక్ష్యాలతో యుటిఎఫ్ పోరాటాలు
- 26న గురజాలలో జిల్లా రెండో కౌన్సిల్ సమావేశం
- పోస్టర్ ఆవిష్కరణ, సన్నాహక సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా యుటిఎఫ్ నిరంతరం పోరాడుతోందని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జి.విజయసారధి అన్నారు. ఈనెల 26న గురజాలలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో నిర్వహించే జిల్లా రెండో కౌన్సిల్ సమావేశాల విజయవంతం కోసం సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులు, యుటిఎఫ్ విధానాలు, ప్రతిపాదనలు, అధికార, ప్రతిపక్షాల తీరుపై మహాసభలో చర్చిస్తామన్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్‌ఎస్ ప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తదితరులు హాజరై ప్రసంగిస్తారన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో రాష్ట్ర విద్యా రంగంలో తీసుకు రావలసిన మార్పులకు సంబంధించి యుటిఎఫ్ ప్రతిపాదనలపై చర్చించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఇటీవల విద్యా రంగంలో మార్పులు గమనిస్తే పెనం మీద నుండి పొయ్యిలో పడినట్లు ఉందన్నారు. ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మానసికక్షోభకు గురిచేసేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయనని విమర్శించారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ ఆకస్మిక తనిఖీలు, ఆయన వ్యవహార శైలి పాఠశాలల్లో ఉపాధ్యాయులతో మాట్లాడే తీరు పాఠశాలలోనే ఉపాధ్యాయుల గుండెపోటుకు గురయ్యే విధంగా ఉన్నాయన్నారు. నూతన జాతీయ విద్యా విధానం రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలో ఒకటి రెండు తరగతులకు పరిమితం చేసే 117 జీవో రద్దు, సిపిఎస్‌కు వ్యతిరేకంగా చేయాల్సిన పోరాటాలపై సమావేశాల్లో చర్చిస్తామని చెప్పారు. సిపిఎస్ రద్దుపై అన్ని రాజకీయ పార్టీలూ అలోచించాలన్నారు. ఈ మేరకు వారిపై ఒత్తిడి తేవాలని, అందులో భాగంగా జరిగే సమావేశాలకు ఉపాధ్యాయులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. యుటిఎఫ్ పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి, సహాధ్యక్షులు ఎ.బాగేశ్వరి దేవి, ఎం.మోహన్‌రావు, కోశాధికారి జెవిడి వాల్యా నాయక్, నాయకులు పాల్గొన్నారు.

సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

వాలంటీర్లతోనే కులగణన

- 27 నుంచి ఇంటింటి సర్వే
- సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు
- తప్పుల దిద్దుబాటుకు 10వ తేదీ వరకు గడువు
- ప్రజాశక్తితో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేషశ్రీ

జిల్లాలో ఈనెల 27 నుంచి వచ్చేనెల 3వ తేదీవరకు కులగణన సర్వే నిర్వహిస్తున్నట్టు జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.శేషశ్రీ తెలిపారు. గ్రామ, వార్డు సచివాయాల సిబ్బంది సహకారంతో వాలంటీర్లు ఈ సర్వేను పూర్తి చేస్తారని చెప్పారు. ప్రణాళిక శాఖతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా పరిషత్ సిఇఒ, గ్రామ, వార్డు సచివాలయాల శాఖతో పాటు అన్ని సంక్షేమ శాఖలు భాగస్వామ్యం అవుతాయన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు అంశాలు తెలియజేశారు.

కులగణనలో ఏయే వివరాలు నమోదు చేస్తారు?

గతంలో ఉన్న జనగణన వివరాలను యాప్ ద్వారా వాలంటీర్లు తమతో తీసుకువెళతారు. మొత్తం 20 రకాల ప్రశ్నలతో కూడిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. కొత్తగా కులం అనే కాలం వద్ద వారి కులం నమోదు చేస్తారు. బీసీల్లో కొన్ని కులాలను మాత్రం వింనహాయించాలని ప్రభుత్వం సూచించింది. కొన్ని కులాలను బీసీల నుంచి ఎస్‌సిల జాబితాల్లోకి మార్చాలనే ప్రతిపాదనలు కేంద్రం పరిశీలనలో ఉండటం వల్ల వీటి వివరాలు ఇందులో నమోదు చేయరు. ప్రభుత్వం నిర్ధేశించిన మిగతా వాటిని యథాతథంగా నమోదు చేస్తారు. కులగణనతో పాటు కుటుంబ సభ్యుల ఉద్యోగ, వ్యాపార, స్వయం ఉపాధి వివరాలు, ఇంటిలో మరుగుదొడ్లు, విద్యుత్ కనెక్షన్లు, ఎల్‌పిజి గ్యాస్, ఇంటి వివరాలు, వ్యవసాయ భూమి, ఇతర ఆస్తులు, ఆదాయం, పశువుల పోషణ వివరాలు కూడా నమోదు చేస్తారు. కులగణనతో పాటు ఆర్థిక, సాంఘిక జీవన పరిస్థితులూ నమోదవుతాయి. ఇల్లు ఏ రకం, వ్యవసాయ భూమి ఎంత? నీటి వసతి ఉన్నభూమి ఎంత తదితర వివరాలు నమోదు చేస్తారు. నివాసం ఒకచోట, మరోచోట ఉండే వారు ప్రస్తుత, శాశ్వత చిరునామాలూ నమోదు చేస్తాం.

సర్వేలో ఎవరి నుంచి వివరాలను అధికారికంగా తీసుకుంటారు?

కుటుంబ పెద్ద అందుబాటులో ఉండే వారి నుంచి తీసుకుంటారు. లేదా కుటుంబంలో ఇతర సభ్యులు ఎవరున్నా వారి నుంచి తీసుకుంటారు. సర్వే చేసే వారు కుటుంబ సభ్యుల నుంచి ఇకెవైసి తీసుకుంటారు. గతంలో జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రాలను కూడా వివరాలు నమోదులో కీలకంగా ఉంటాయి. వీటి వివరాలు ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాలల్లో ఉన్నాయి. వీటినే ప్రమాణికంగా తీసుకుంటాం.

కులగణన సర్వే ఎప్పటికి పూర్తవుతుంది?

ఈనెల 27 నుంచి 3వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి అందరి వివరాలు నమోదు చేస్తారు. తరువాత వచ్చే నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు సర్వేలో తప్పులు సరిదిద్దేందుకు అవకాశం కల్పించారు. 10వ తేదీ తరువాత తుది నివేదిక ప్రభుత్వానికి అందిస్తారు.

సర్వే నిర్వహణకు ఏర్పాట్లు?

ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులందరికీ వివిధ దశల్లో శిక్షణ ఇచ్చారు. ఈనెల 18న కుల సంఘాలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన సర్వే జరుగుతుంది. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కూడా సిబ్బందికి శిక్షణిస్తున్నాం.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆర్‌విఆర్‌లో విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

ఆలోచనల నుండి అంకుర పరిశ్రమల స్థాపన వరకూ, కళాశాల ఇంకుబేటర్ సెంటర్ ద్వారా ఎంపిక చేసిన 200 మంది విద్యార్థులతో తొలి బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభించుకోవటం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు శుపరిణామమని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనుమతులతో కళాశాలలో ఇటీవల నూతనంగా ప్రారంభించిన 'ఇంక్లూసివ్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్' ద్వారా విద్యార్థులను పారిశ్రామిక వేత్తలుగా, ఆవిష్కర్తలుగా, శాస్త్రవేత్తలుగా తయారు చేయటానికి అవసరమైన శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలలోని ఐఐసి అండ్ ఇఎమ్‌డి సెల్, ఇన్నో ఫోర్జ్: ఐడియేటెడ్ అండ్ ప్రోటోటైప్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో 'కిక్‌స్టార్ట్ ఫ్రమ్ టూ స్టార్ట్ అప్' అంశంపై విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ప్రాగ్మాటిక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఫౌండర్ అండ్ సిఇఒ భరత్ గుజవర్తి, ప్రముఖ పారిశ్రామిక వేత్త డాక్టర్ ఎ.రాఘవరావు పాల్గొని ఐటియేషన్, ప్రోటోటైప్, ప్రొడక్ట్ డవలప్‌మెంట్, మార్కెటింగ్ అంశాలపై ప్రసంగించారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిని స్టార్ట్‌ఆప్ హబ్‌గా నెలకొల్పటమే తమ లక్ష్యమని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల ఇంక్యుబేటర్ సెంటర్ ద్వారా 200 మంది విద్యార్థులతో ప్రారంభించిన తొలి బ్యాచ్ శిక్షణా తరగతులు ఒక సంవత్సరం పాటు జరుగుతాయని, ఇందులో విద్యార్థులకు నైపుణ్యం కలిగిన ఇండస్ట్రియల్ మెంటర్స్ ద్వారా విద్యార్థుల ఆలోచనలతో కూడిన పరికరాల నమూనాల తయారీ, ప్రొడక్స్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్ వివిధ రకాల పరిశోధనలకు శిక్షణ అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ఐటిబిఐ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎం.వి.పి చంద్రశేఖర్, ఇన్నోఫోర్జ్: ఐడియేట్ అండ్ ప్రోటోటైప్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ కె.కార్తీక పవన్, ఐఐసి కన్వీనర్ డాక్టర్ నాగమల్లేశ్వరరావు, కో కన్వీనర్ డాక్టర్ సజ్జా రాధిక పాల్గొన్నారు.

భరత్ గుజవర్తికి బొకే అందచేస్తున్న కాలేజ్ యాజమాన్యం